# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-09-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులను వివరిస్తూ.. కేంద్రానికి లేఖ రాస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

❖ వన్యప్రాణుల సంరక్షణను మరింత బలోపేతం చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.

❖ నిత్యావసర సరుకులను ప్రజలకు తక్కువ ధరలకే అందిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

❖ అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యాటక రంగంలో సేవలు అందించిన వారికి విశిష్ట పురస్కారాలు ప్రధానం చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు.

========================

రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులను వివరిస్తూ.. కేంద్రానికి లేఖ రాయనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం ఈరోజు జరిగినది. ఈ సందర్భంగా ప్రధానంగా ఎల్‌నినో పైనే సుదీర్ఘ చర్చ జరిగింది. ఆ వివరాలను రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి పాత్రికేయులకు వివరించారు. ఎల్ నినోకి సంబంధించి ప్రతినెలా క్షేత్రస్థాయి పరిస్థితులు కేంద్రానికి నివేదించాలని నిర్ణయించామని తెలిపారు. అలాగే గత 30 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా అతి తక్కువ వర్షపాతం ఈసారి నమోదైందని పేర్కొన్నారు. తాగునీరు అందించటం, పశుగ్రాసానికి లోటు లేకుండా చూడటం వంటివి చేయాలని మంత్రులకు ముఖ్యమంత్రి సూచించారని చెప్పారు.

(వాయిస్ 30 సెకన్లు)

ఇదిలా ఉండగా మంత్రివర్గ సమావేశంలో తాగునీటికి ఎంతైనా ఖర్చు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఒక్క ఎకరా కూడా ఎండటానికి వీలు లేదని స్పష్టం చేశారు. అదే విధంగా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో జీఎస్‌డీపీ తగ్గకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

========================

రాష్ట్రంలో వన్యప్రాణుల సంరక్షణను మరింత బలోపేతం చేసే దిశగా సరికొత్త ప్రణాళికలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అటవీ శాఖ అధికారులను ఒక ప్రకటనలో ఆదేశించారు. ఇటీవల చోటు చేసుకున్న వన్యప్రాణుల మరణాల ఘటనలపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని కోరారు. అదే విధంగా పులుల మరణాలపై అధ్యయనానికి అటవీ శాఖ సలహాదారు, అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీకి ఆ బాధ్యతలను అప్పగించారు. వన్యప్రాణుల ఆవాసాల నిర్వహణ, రక్షణ చర్యలు, మానవ-వన్యప్రాణి ఘర్షణల నివారణ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంరక్షణ కార్యక్రమాల ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆ కమిటీకి ఉపముఖ్యమంత్రి సూచించారు.

========================

నిత్యావసర సరుకులను ప్రజలకు తక్కువ ధరలకు అందిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అమరావతిలో పాత్రికేయులతో ఈరోజు ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే బియ్యం తక్కువ ధరలకు రైతు బజారులలో విక్రయిస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకు నిత్యావసర వస్తువులను అందజేస్తామని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

========================

అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27న ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వార్షిక పర్యాటక విశిష్ట పురస్కారాలు-2025-26 ప్రధానం చేయనున్నామని పర్యాటక, శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. "డిజిటల్ ఎజెండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పర్యాటక రంగ పునర్నిర్మాణం" అనే ఇతివృత్తంతో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. క్లాసిఫైడ్ హోటళ్లు, రెస్టారెంట్లు, ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, పర్యాటక ప్రాజెక్టులు, విద్యా సంస్థలు, గైడ్లు, రచయితలు, ఫిల్మ్ మేకర్లు, డిజిటల్ క్రియేటర్లకు ప్రాతినిధ్యం కల్పిస్తూ.. మొత్తం 38 విభాగాలలో 46 పురస్కారాలను అందించనున్నామని తెలియజేశారు. దరఖాస్తుల సమర్పణకు సెప్టెంబర్ 18న తుది గడువు అని పేర్కొన్నారు.

విరామం

========================

ఆంధ్రప్రదేశ్ ని 2027 సెప్టెంబర్ నాటికి 100 శాతం సంపూర్ణ అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన అక్షర ఆంధ్ర కార్యక్రమం రాష్ట్రంలో అద్భుత ఫలితాలను సాధిస్తోందని తెలిపారు. గత రెండేళ్లలో అక్షరాస్యత రేటు 72.6 శాతం నుంచి 82.1 శాతానికి పెరగడం, జాతీయ సగటు 80.9 శాతాన్ని అధిగమించడం రాష్ట్ర విద్యా రంగంలో సాధించిన గణనీయమైన పురోగతికి నిదర్శనమని ఆయన అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యారంగంలో విస్తృతంగా వినియోగిస్తూ.. ఉపాధ్యాయులకు కృత్రిమ మేధపై శిక్షణ అందించడం జరుగుతోందన్నారు. రాబోయే రోజుల్లో అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేసిందని మంత్రి తెలిపారు.

========================

రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలపై మార్గదర్శకాల సవరణకు రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తూ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు ఈరోజు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యా హక్కు చట్టం-2009 సెక్షన్ 12 (1) (c) ప్రకారం.. రాష్ట్రంలోని ప్రైవేటు అన్-ఎయిడెడ్ పాఠశాలల్లో నిరుపేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు ఉన్న మార్గదర్శకాలను సవరించే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఛైర్‌పర్సన్‌గా 16 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సమీమ్ అన్సారియా చైర్ పర్సన్‌గా వ్యవహరిస్తారని పేర్కొంది.

========================

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో అక్టోబర్ 11 నుండి 20న విజయదశమి వరకు 10 రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని ఆలయ అధికారులు తెలియజేశారు. అక్టోబర్ 16న మూలా నక్షత్రం పురస్కరించుకుని శ్రీ సరస్వతి దేవి అలంకారం, అక్టోబర్ 20న విజయదశమి రోజున శ్రీ రాజరాజేశ్వరి దేవి రూపంలో అమ్మవారు దర్శనమిస్తారు. అదే రోజు సాయంత్రం కృష్ణానదిలో నిర్వహించే హంసవాహన తెప్పోత్సవంతో ఈ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగుస్తాయని చెప్పారు.

========================

ఈశాన్య మధ్యప్రదేశ్, దాని పరిసర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం అదే ప్రాంతంలో కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి.. ఎత్తు పెరిగే కొద్దీ దక్షిణం వైపు వంగి ఉందని పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజులలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారిణి జి.లక్ష్మి తెలియజేస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

========================

విశాఖపట్నంలో ఈ నెల 10 నుండి 12వ తేదీ వరకు 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ (IATO) జాతీయ వార్షిక సదస్సుని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర పర్యాటక రంగ వర్గాలకు IATO సభ్యత్వం, రిజిస్ట్రేషన్ రుసుముల్లో రాయితీ ఇస్తున్నామని మంత్రి చెప్పారు. పర్యాటక ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కందుల దుర్గేష్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

========================

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో మంత్రులు బిసి జనార్ధన్ రెడ్డి, పయ్యావుల కేశవ్, ఎన్ఎండి ఫరూఖ్, నంద్యాల జిల్లా శాసనసభ్యులు ఈరోజు అమరావతిలోని సచివాలయంలో ఆయన ఛాంబర్ లో సమావేశం అయ్యారు. నంద్యాల జిల్లా తాగునీటి అవసరాలపై రామానాయుడుతో ఈ సందర్భంగా వారు చర్చించారు.

========================
========================